# నవ్వుల టానిక్

'నవ్వుతూ బ్రతకాలిరా!' అని ఎవరో చెప్పినట్లు- నవ్వుతూ బ్రతకడంలో వున్న మజా, నవ్వుతూ బ్రతికేవారికి తప్ప ఇతరులకు తెలియదు.

కడివెడు దుఃఖం కడుపులో వున్నా సరే... నవ్వుతూ బ్రతికేవాళ్ళు ఎప్పుడూ నవ్వుతూనే వుంటారు. ఒక్కసారి కడుపు నిండా నవ్వితే ఎన్నో కేలరీల శక్తి వస్తుందని వైద్యులు చెప్తారు.

ఆరోజు జనవరి 11... **'అంతర్జాతీయ నవ్వుల దినోత్సవం!'**

ముంబాయిలోని 'లాఫర్స్ క్లబ్ ఇంటర్నేషనల్'కి బ్రాంచి అయిన 'లాఫర్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్' త్యాగరాయ గానసభలో 'అంతర్జాతీయ నవ్వుల దినోత్సవ సభ' ఏర్పాటు చేసింది.

హాలులో చుట్టూ గోడలకు మనసారా కడుపునిండా నవ్వుతున్న రేలంగి, రమణారెడ్డి, చలం, కె.వి.చలం, పద్మనాభం, బాలకృష్ణ, శివరావు, పేకేటి శివరాం, బొండలపాటి శివరామకృష్ణయ్య, రాజబాబు, బ్రహ్మానందం, ఐరన్‌లెగ్ శాస్త్రి, థమ్, ఏ.వీ.ఎస్. తదితర హాస్యనటుల పెయింటింగ్స్ నిలువెత్తు సైజువి అలంకరించారు.

ప్రేక్షకులు హాలులోకి ప్రవేశించగానే చుట్టూ చూసి నవ్వుకుంటూ హాలులోకి ప్రవేశిస్తున్నారు.

'లాఫర్స్ క్లబ్' వాళ్ళకి నవ్వలేని వాళ్ళను నవ్వించడం ఒక ఆశయం! ప్రతి ఆదివారం సభ్యులంతా సమావేశమై రెండు మూడు గంటలు జోకులు చెప్పుకుని నవ్వుకుంటూ ఉంటారు. ఆ తరువాత ప్రత్యేకంగా ఒకర్ని చూసి మరొకరు కడుపు చెక్కలయ్యేట్లు నవ్వుకుంటుంటారు. ఒక్కోసారి నవ్వడం ఎక్కువై కళ్ళ నుండి నీళ్లు వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆ క్లబ్‌లో సభ్యులు చెబుతుంటారు.

సభ ప్రారంభమైంది!

నిర్వాహకులు వేదిక ఎక్కారు...

"సభకు నవ్వులతో నమస్కారం! నవ్వుతూ బ్రతకండి... 'నవ్వడం' అనేది భగవంతుడు ఒక్క మానవజాతికి మాత్రమే ప్రసాదించిన వరం! నవ్వకపోయినా, నవ్వించలేకపోయినా నవ్వేవాళ్ళని చూసి సహించలేకపోయినా ఆ మనిషిలో ఏదో లోపం ఉందన్నమాట!

ఈరోజు అంతర్జాతీయ నవ్వుల దినోత్సవం! ఈరోజు మేము ఒక వెరయిటీ కార్యక్రమం చేపట్టాం. ఈ హాలులో వున్న వాళ్ళందరికీ ఒక పరీక్ష! మేము కొన్ని రకాల సంఘటనలతో కూడిన ప్రదర్శన ఇప్పుడు మీకు చూపిస్తాం. ఈ ప్రదర్శనలోని సంఘటనలో

ఏ ఒక్క ఐటమ్ చూసి అయినా సరే... మీరు నవ్వకపోతే- అలాంటి వారికి లక్ష రూపాయలు సమానంగా పంచి పెట్టాలని నిర్ణయించాం.

ఐతే... ఒక చిన్నమాట! లక్ష రూపాయలలో భాగం పొందడం కోసం మీరు మీ నవ్వుల్ని బలవంతంగా ఆపుకోవాలనుకుంటే మాత్రం జాగ్రత్త! మేము హాలులో క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్స్ ఏర్పాటుచేశాం. వాటిద్వారా న్యాయనిర్ణేతలు పరిశీలిస్తుంటారు. అవి మిమ్మల్ని పట్టించేస్తాయి. దయచేసి గమనించండి. మరి, ప్రదర్శన మొదలుపెడదామా!

హలో... ఫ్రెండ్స్! నవ్వండి... హాయిగా నవ్వండి! మిమ్మల్ని నవ్వించేవాళ్ళని ఇంకా నవ్వించమని అడగండి. పకపకా నవ్వేవాళ్ళని చూసి మీరూ కడుపునిండా నవ్వండి!" అంటూ నిర్వాహకులు వేదిక దిగారు.

ప్రదర్శన ప్రారంభమైంది... తెర ప్రక్కకు తొలగింది!

తెల్లని పైజమా, లాల్చీ వేసుకున్న సన్నగా, రివటలా ఉన్న విలాస పురుషుడు, బాపు కార్టూన్‌లో పీపాలాగ వున్న ఆయన శ్రీమతి స్టైల్‌గా నడుస్తున్నారు. ఆవిడ పోనీటైల్ వేసుకుంది. స్లీవ్‌లెస్ జాకెట్‌తో చాలా స్టైల్‌గా ఉంది.

"మైడియర్! ఈరోజు మన మేరేజ్ డే కదా... మనం ఎక్కడికి వెళ్దాం?" అన్నాడాయన.

"మంచి హోటల్‌లో టిఫిన్ చేసి..."

ఆమె మాటలకు అడ్డువచ్చి "అదిసరే... నీకు ఏం టిఫిన్ కావాలి?"

"ఇడ్లీ, పూరి, అట్లు, ఉప్మా..." ఆమె నవ్వుతోంది.

"చాలు, చాలు... ఇవన్నీ తింటే కడుపు పగిలిపోతుందే!" అన్నాడాయన.

"చాల్లెండి... మీరు మరీను! వీటిల్లో ఏదో ఒకటి!" అందామె నెత్తిమీద మొట్టికాయ వేసి. ఆ తర్వాత ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని చాలా షోగ్గా, విలాసంగా నడవసాగారు. ఆమె అయితే శరీరం అంతా తిప్పుకుంటూ నడుస్తోంది.

వీళ్ళకు ముందు ఒక యువకుడు అరటిపళ్ళు తింటూ నడుస్తున్నాడు.

మరుక్షణంలో...

పైజమా, లాల్చీ వేసుకున్న వ్యక్తి బూటుకాళ్ల క్రింద ఒక అరటితొక్క, ఆయన శ్రీమతి కాళ్ల క్రింద ఒక అరటితొక్క పడి, జారి ఆయన పడిపోయారు. వెనువెంటనే ఆమె కూడా ఆయన మీద పడిపోయింది.

"చచ్చానే... అండాళ్ళూ!" అని కేకేశాడు- ఆమె క్రింద నలిగిపోయిన ఆయన.

తెర మూత పడింది...

హాలంతా నవ్వులతో హోరెత్తిపోయింది!

"నవ్వేవారందరికీ నవ్వుల కృతజ్ఞతలు!" అంటూ హాలంతా మైకులలో వినపడింది.

మళ్లీ... తెర ప్రక్కకు తొలగింది!

ఆ గదిలో ఒక వ్యక్తి కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. అతని ప్రక్కనే పడక కుర్చీ, ఎదురుగా మరో కుర్చీ!

ఈలోగా సూటు, బూటులో వున్న ఒక వ్యక్తి ప్రవేశించాడు. ఆయన గాలి ఊదిన బెలూన్‌లా వున్నాడు.

ఆయన్ని చూడటం ఆలస్యం- పేపరు చదువుతున్న వ్యక్తి కంగారు కంగారుగా లేచి, వణికిపోతూ- "సర్! ఏమిటి సర్... మా ఇంటికి వచ్చారు? కబురు చేస్తే నేనే వచ్చేవాడిని కదా!" అంటూ చాలా టెన్షన్ పడిపోతున్నాడు.

అందుకు ఆయన "చూడబ్బాయ్! నువ్వు వర్రీ అవకు. ఈ వీధిలో మా బంధువులు వుంటే వచ్చాను. నువ్వు వున్నావో, లేవోనని చూద్దామని వచ్చాను. నన్ను చూసి హడలిపోకు..." అన్నారాయన తాపీగా.

"మిమ్మల్ని చూస్తే నాకు చాలా భయం సార్! దయచేసి ముందు మీరు కూర్చోండి!" అంటూ ఆయనకు పడకకుర్చీ చూపించాడు- ఆయన పడుకొని రిలాక్స్ అవుతాడనే ఉద్దేశ్యంతో.

ఆయన అతని మాటలు విని- పడకకుర్చీలో కూర్చోవడం, ఆ వెంటనే నేలమీద పడిపోవడం, ఆయన భారీకాయం కుర్చీ ఫ్రేమ్‌లో ఇరుక్కుపోవడం... ఒకేసారి జరిగిపోయింది.

"అయ్‌బాబోయ్ం... కొంప మునిగింది! ఎవరో కఱ్ఱ లాగేశారు!" అని లోపల అనుకోబోయి- పైకి అనేశాడు పేపరు పట్టుకున్న వ్యక్తి.

"స్కౌండ్రల్! నన్ను ఇంటికి పిలిపించి పడక్కుర్చీలో గుడ్డకు కఱ్ఱ తీసేసి, నన్ను పడేసి షేమ్ చేయాలనుకున్నావన్న మాట! టుమారో ఐ విల్ సస్పెండ్ యూ..." అంటూ కోపంతో అరుస్తున్న ఆయన్ని చూసి-

"సర్... నన్ను క్షమించండి! పిల్లలెవరో ఈ వెధవ పని చేసివుంటారు..."

"డోన్టాక్ ట్రాష్! పైగా, పిల్లల్ని ఇరికిస్తావా ఇందులో? ఆఫీసులో ఛండశాసనుణ్ణి అని నన్ను ఇలా అనుమానిస్తావా? ఐ విల్ సీ యువర్ ఎండ్! అలా మిడిగుడ్లేసుకుని చూస్తావేం? ముందు నన్నీ కుర్చీలోంచి లేపవయ్యా..." అంటూ అతని సహాయంతో ఆ కుర్చీ ఫ్రేమ్‌లోంచి బయటపడి రుసరుసలాడుతూ వెళ్ళిపోయారాయన.

"ఇక ఆఫీసులో నా పని గోవిందా!" అంటూ ఆ వ్యక్తి నెత్తిన చేతులు పెట్టుకున్నాడు.

తెర మూత పడింది!

ఆ హాలంతా మళ్ళీ ఒక్కసారిగా నవ్వులతో మారుమ్రోగింది. కొంతమందైతే నవ్వు ఆపుకోలేక కుర్చీల్లోంచి లేచి నిలబడి నవ్వుతున్నారు.

"నవ్వే వారందరికీ నవ్వుల నీరజనాలు! చివరి ప్రదర్శన చూసి వెళ్లండి..." అంటూ మళ్లీ హాలంతా మైకుల్లో వినపడింది.

మళ్లీ తెర ప్రక్కకు తొలగింది..!

అదొక వీధి...

ఆ వీధిలో ప్రతి ఇంటిగేటుకీ 'కుక్కలు ఉన్నాయి జాగ్రత్త!' అనే బోర్డులు వున్నాయి.

నలుగురు యువకులు ఒకరి భుజాలపై మరొకరు చేతులు వేసుకొని కులాసాగా నడుస్తున్నారు. ఇద్దరు జీన్స్, షర్ట్స్ లాంటి స్టైల్ డ్రెస్‌లు వేసుకుంటే- మరో ఇద్దరు క్యాజువల్ డ్రెస్‌లు వేసుకున్నారు.

"అరేయ్ం... అసలు అందరూ కుక్కలను చూసి భయపడతారు. అయితే అసలు మనం కుక్కల్ని చూసి భయపడినట్లుగా కనిపిస్తేనే అవి మన జోలికి వస్తాయి గాని, నిజానికి అవి చాలా మంచివిరా!" అన్నాడు ఒక యువకుడు.

"అసలు కుక్కలు మన దగ్గరికి వచ్చినా వాసన మాత్రం చూస్తాయిటరా... మనకి కుక్కలంటే ఇష్టమో, లేదో తెలుసుకోడానికి! అప్పుడే మనం భయపడకూడదు... ధైర్యంగా ఉండాలి. అప్పుడు వాటికి తామంటే వీళ్ళకి ఇష్టమో, లేదో తెలుస్తుందట!" అన్నాడు మరొకడు.

"అవునురా... నిజమే! నాకూ ఒకాయన చెప్పాడు. కుక్కలను చూసి రాళ్లు తియ్యడం, కఱ్ఱ పట్టుకోవడం లాంటి పనులు చెయ్యడం కూడదంట! అలా చేస్తే వెంటపడి తరుము తాయట!" అన్నాడు ఇంకొకడు.

"అరేయ్ః... కుక్కల సంగతి ఎత్తకండిరా! నాకు కుక్కలంటే చచ్చేంత భయం! అసలు ఈ వీధిలోంచి వద్దంటే ఇటే తీసుకువచ్చారు!" అన్నాడు ఇంకొకడు.

"పిరికిగొడ్డా..." అంటూ అతన్ని ఆట పట్టించసాగారు మిగతావాళ్ళందరూ.

ఇంతలో...

ఒక ఇంటి గేటులోంచి ఆ ఇంటిలో ప్రవేశించిన ఒక ఊరకుక్కను తరుముకుంటూ మనిషిని మించిన సైజులో వున్న ఆల్సేషియన్ డాగ్ ఉరుకుల పరుగులతో బయటకు వచ్చింది.

అంతే..!

ఈ హఠాత్పరిణామానికి ఆ నలుగురు యువకులూ భయపడిపోయి "ఛ... ఛ!" అన్నారో, లేదో... ముందు ఊరకుక్క, మధ్యలో నలుగురు యువకులూ, ఆ వెనుక ఆల్సేషియన్ డాగ్ నోట్లో జీన్స్‌ప్యాంట్ ముక్క కూడా అదనంగా చేరింది. పరుగు పందెం సాగుతోంది.

తెర మూసుకుంది!

సభా నిర్వాహకులు వేదిక పైకి వచ్చారు.

"సభికులారా... నవ్వుల శుభాభినందనలు! ప్రపంచంలో నవ్వడం రాని వాళ్ళెవరూ ఉండరని ఇవ్వాళ ఋజువైంది. మా క్లోజ్‌డ్ సర్క్యూట్ టెలివిజన్స్ ద్వారా సభలోని వారందరినీ గమనించడమైంది. సభలో నవ్విన వాళ్ళందరికీ కృతజ్ఞతలు! 'నవ్వు నాలుగు విధాల చేటు' అంటారు. కాని, నవ్వు మనిషికి ఆరోగ్యాన్ని కలుగజేస్తుందనడంలో సందేహం లేదు. 'లాఫర్ ఈజ్ ది బెస్ట్ మెడిసిన్' లాగా మనిషి జీవితానికి నవ్వు అనేది టానిక్ లాంటిది.

ఈ సభలో నవ్వనివాళ్ళకు బహుమతిగా అందజేద్దామనుకున్న లక్ష రూపాయలు మిగిలిపోయాయి. ఆ డబ్బును మా కేంద్ర కార్యాలయమైన 'లాఫర్స్ క్లబ్ ఇంటర్నేషనల్-బొంబాయి' వారికి పంపిస్తాము.

నవ్వుతూ బ్రతకండి... నవ్వించండి! ఒక్కసారి కడుపునిండా నవ్వితే శరీరంలో ప్రతీ అణువు ఉత్తేజితమవుతుంది. ఇది మా మాట కాదు... శాస్త్రజ్ఞులు చెప్పిన మాట! ఇంతటితో సభ ముగిసింది!" అని అంటూ ఉండగానే సభలో జనం నవ్వుకుంటూ వెళ్తున్నారు... కులాసా 'నవ్వుల టానిక్' సేవించి.

●

'వార్తాసాగరం' దినపత్రిక ... 9 మార్చి' నుండి 11 మార్చి' 2004 సంచికలలో ప్రచురితం